# పకడ్బందీగా డిజిటల్ సర్వే



తాండూరు మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు, అక్టోబర్4: వన్ స్టేట్... వన్‌కార్డ్ నినాదంతో ఈ-కార్డును ప్రభుత్వం అంద జేయనుందని అందులో భాగంగా ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ... ప్రభుత్వపరంగా లభించే అన్ని సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఉపయోగపడుతుం దన్నా రు. ఈ డిజిటల్ కార్డులో కుటుంబంలో ఉన్న ప్రతి సభ్యుడి హెల్త్ ప్రొఫైల్ ఉండేలా చూస్తు న్నారన్నారు. దీని వల్ల ప్రభుత్వపరంగా వైద్య సేవలను పొందే వీలుంటుందన్నారు. సంక్షేమ పథకాలకు, ఇతర అవసరాలకు అన్నింటినీ ఒకే గొడుకు కింద తీసుకువస్తూ ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందజేయడానికి ప్రభుత్వం సిద్ధమౌతుందన్నారు. ఈ కార్య క్రమంలో కమిషనర్ విక్రమసింహా రెడ్డి, కౌన్సిలర్ బాలప్ప, మేనేజర్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### కొడంగల్ నియోజకవర్గంలో..

కొడంగల్, అక్టోబర్ 4: ప్యామిలీ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు, ఇంటి వివరాలు వంటి వాటికి సంబంధించి ఒకే కార్డును ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. కాబట్టి పూర్తి స్థాయి వివరాలను సేకరించే విధంగా సిబ్బంది బాధ్యత తీసుకోవాలని తెలిపారు. 8వ వార్డులో మొత్తంగా 300ల ఇండ్లను సర్వే నిర్వ హించాల్సి ఉండగా ప్రస్తుతం 87 ఇండ్ల సర్వే పూర్తైనట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జటిలంగా ట్రాఫిక్ సమస్య



తాండూరు రూరల్, అక్టోబర్ 4 : తాండూరులో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ జటిలమవుతోంది. పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ముందు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. కానీ పోలీసు స్టేషన్‌లో వసతులు లేవు. కార్యాలయం నుంచి ఎలాంటి కార్యకలాపాలు జరపడంలేదు. ట్రాఫిక్ సమస్య కారణంగా పట్టణంతోపాటు సరిహద్దుల్లో ఏదో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటుండంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పోలీసులు నివారణ చర్యలు తీసుకుంటున్న ప్పటికీ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. తాండూరు పట్టణం వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. తాండూరు ప్రాంతంలో నాపరాయి పరిశ్రమ, సుద్ధ వ్యాపారంతోపాటు మండలంలో మూడు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండగా, తెలంగాణ సరిహద్దులోని కర్నాటకలో రెండు భారీ సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. తాండూరు మండలంలో సీసీఐ, పెన్నా, ఐసీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. తెలంగాణ సరిహద్దులో వికాట్‌సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఆయా ఫ్యాక్టరీలకు నిత్యం మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి బొగ్గు, యాస్ తోపాటు ఇతర సామాగ్రి వస్తోంది. అంతేగాకుండా ఈ ప్రాంతం నుంచి సిమెంట్ లోడ్‌తో భారీ ట్యాంకర్లు, లారీలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. వీటికితోడు స్థానికంగా నాపరాయి వ్యాపారం కోసం పలు రాష్ట్రాల నుంచి భారీగా వాహనాలు వస్తూ, పోతూ ఉంటాయి. ఈ వాహనాలన్నీ తాండూరు పట్టణంలో నుంచి వెళుతుంటాయి. వీటి కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగి పోయింది. కాగా ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు పట్టణం వెలుపలనే భారీ వాహనాలను ఆపేస్తున్నారు. దాంతో స్కూల్ టైంలో విద్యార్థులకు ఇబ్బందులు తగ్గాయి.

### ఇందిరాచౌక్ - రైల్వే స్టేషన్‌కు దారేది...

పట్టణంలోని ఇందిరాచౌక్ – రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందిరాచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో రోడ్లపై తోపుడుబండ్లు ఉండడంతో అనే సమస్యలు ఎదురవుతున్నాయి. రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులు వెళ్లే సమయంలో ఇబ్బందికరంగా ఉంటుంది. భద్రేశ్వర దేవాలయం, ఇందిరాచౌక్, మర్రిచెట్టు కూడలి, శివాజీ చౌక్, బస్టాండ్ సమీపంలోని ఫ్లై ఓవర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలె త్తుతోంది. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

### సిగ్నల్ వ్యవస్థను పునఃరుద్ధరించాలి

ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు పట్టణంలో శివాజీచౌక్, ఇందిరాచౌక్, బస్టాండ్ ఏరియాల్లో సిగ్నల్ వ్యవస్థను పునఃరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఇందుకు మున్సిపల్‌తోపాటు పోలీసు శాఖ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోడ్లపై జీబ్రా క్రాసింగ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో అక్కడక్కడ నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్లపై సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాల్సిన వససరం ఉంది. ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టించవద్దని సీఐ సంతోష్‌కుమార్ తోపుడు బండ్లచిరు వ్యాపారులకు సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య పై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శివాజీచౌక్‌లో నిరుపయోగంగా సిగ్నల్ వ్యవస్థ

# ఘనంగా దసరా నవరాత్రులు

గాయత్రీదేవిగా, అన్నపూర్ణాదేవిగా అమ్మవారి దర్శనం



పరిగిలో గాయత్రీదేవిగా ..



బొంరాస్‌పేట: పోలేపల్లిలో ఎల్లమ్మ దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా..

పరిగి, అక్టోబర్ 4 : దేవీ శరన్నవరాత్రులలో భాగంగా పరిగి పట్టణం లోని బహార్‌పేట్ హనుమాన్ మందిర్‌లో ఏర్పాటుచేసిన దుర్గామాత శుక్రవారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఈ మేరకు అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు దుర్గాదేవి మాలధారణ చేపట్టి పూజలు చేశారు.

**బొంరాస్‌పేట:** దసరా నవరాత్రులు బొంరాస్‌పేట, దుద్యాల మండ లాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని అన్న పూర్ణా దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాల యంలో హోమం నిర్వహించారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని దుర్గామాత దేవాలయంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్టించిన దుర్గామాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో రాత్రిపూజ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# ఓపెన్ యూని వర్సిటీ అడ్మీషన్లకు గడువు పొడిగింపు

కొడంగల్, అక్టోబర్ 4: పట్టణ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సర ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఫీయాఖానమ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని, రెగ్యులర్‌గా చదవలేని విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీ పూర్తి చేసుకోవాలని కోరారు.

# హనుమంతవాహనంపై ఊరేగిన అనంతపద్మనాభస్వామి

వికారాబాద్, అక్టోబర్ 4 : వికారాబాద్ ఆలంపల్లి శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమంతవాహనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరించి ఆలయ పురవీధులో హనుమంతవాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ ఊరేగింపులో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్, వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 5న శనివారం ముత్యాలపందిరి సేవ, 6న ఆదివారం సాయంత్రం శేషవాహన సేవ, 7న సోమవారం సాయంత్రం గరుఢ వాహన సేవ, 8న మంగళవారం చంద్రవాహన సేవ, 9న బుధవారం గజవాహన సేవ, 10న గురువారం సింహా వాహన సేవ, 11న శుక్రవారం గరుఢ వాహన సేవ, వసంతోత్సవం అనంతరం సిం వాహన సేవ, 12న శనివారం దసరా సందర్భంగా అశ్వవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పరిగి, అక్టోబర్ 4 : పరిగి పట్టణంలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డు నుంచి బతుకమ్మలతో ఊరేగింపు జరిపి పట్టణంలోని మినీ స్టేడియంలో బతుకమ్మ సంబురాలు జరిపారు. పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థినులు భారీ సంఖ్యలో ఈ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# ఆటల పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి

పెద్దేముల్, అక్టోబర్ 4 : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వాహకుడు సి.రాఘవేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చిట్టెపుప్రకాశ్‌రెడ్డి మోమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, నరేష్ రెడ్డి, కిషన్ రావు, ఎర్ర బాలప్ప, విద్యాసాగర్, పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, శిబ్లి, ఇందూరు ప్రకాశ్, చందర్, శ్రీనివాస్, ఆర్గనైజర్లు సీహెచ్.వెంకటేశ్, మతీన్, అఖిల్, తన్వీర్, బంగ్ల రఘు, సంజీవ్, ఆదర్శ్‌రెడ్డి, ఖయ్యూం బాండ్, నర్సింహా,అశోక్ తదితరులు పాల్గొన్నారు



కులకచర్ల, అక్టోబర్ 4: ఎస్టీ కోటా నుంచి ఆదివాసీలకు ప్రత్యేక కోటాను కేటాయించాలని, డీఎస్సీలో ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలంగాణ ఆదివాసీ చెంచు సంఘం అధ్యక్షుడు కుక్కల అంజిలయ్య, ప్రధాన కార్యదర్శి చెంచు హన్మంతు కోరారు. శుక్రవారం కులకచర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

# పంట పొలాలను పరిశీలించిన అధికారులు


కులకచర్ల, అక్టోబర్ 4: చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు పంటలపై తగిన సూచనలు ఇచ్చారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వేనెంబర్ ఆధారంగా పంటలను పరిశీలించాలని, పత్తి, కంది, ఆయా పంటలను పరిశీలించి తగిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

# అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు పంపిణీ

దోమ, అక్టోబర్ 4: అంగన్‌వాడీల ద్వారా బాలింతలకు, పిల్లలకు పౌష్టి కాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బాలామృతంతో పాటు గా కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నది. అయితే అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కుళ్లిన గుడ్లు అంగన్‌వాడీలకు వస్తున్నాయి. దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఇన్‌చార్జి టీచర్ లబ్ధిదారులకు గుడ్లను పంపిణీ చేశారు.గుడ్లను తీసు కువెళ్లిన బాలింతలు, పిల్లలు వాటిని నీటిలో వేసి చూడగా అవి పైకి తేలడం గమనించారు. వాటిని పగులగొట్టి చూడగా దుర్వాసన వచ్చింది. గుడ్లు కుళ్లిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఎజెన్సీల నిర్వా హకులు నాణ్యమైన గుడ్లను సరఫరా చేయక పోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లబ్ధిదారులకు అందించే గుడ్లను నాణ్యమైనవిగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



# మందు తాగించి మట్టుబెట్టారు..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీమ్‌కుమార్

ధారూరు, అక్టోబర్ 4: వారం క్రితం అదృశ్యమైన వ్యక్తిని హత్య చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు ధారూరు సీఐ బీమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ధారూరు పోలీస్‌స్టేషన్ లో మీడియా సమావేశంలో ఈ కేసు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.గత నెల 25న కోట్‌పల్లి మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన నర్సింహులు కుమారుడు శ్రీకాంత్ కోట్‌పల్లికి వెళ్లి వస్తానని రాలేడు. మూడు రోజులు రాకపోయే సరికి అదేనెల 28న కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితులు చౌట మల్లేశం, మొల్ల బోయేళ్లీ, బంటు బోయేళ్లీ అంజప్పలను విచారించగా శ్రీకాంత్‌ను హత్యచేసినట్లు ఒప్పుకున్నారు. గత నెల 25న శ్రీకాంత్‌కు బాగా మందు తాగించి హత్యచేసి జడీ మల్కాపూర్ జలపాతంలో వేసినట్లు తెలిపారన్నారు. పోలీస్ సిబ్బందితో జడీ మల్కాపూర్ జలపాతంలో వెతికినా మృత దేహం లభించలేదని తెలిపారు.శ్రీకాంత్‌ను చంపిన చౌట మల్లేశం, మొల్ల బోయేళ్లీ, బంటు బోయేళ్లీ, అంజప్ప లను అరెస్టు చేసి జైలుకి పంపించారు. అనిత పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వికారాబాద్, అక్టోబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివాపేటకు చెందిన జావీద్(24) అతని స్నేహితుడు మఫజ్ పటేల్ గురువారం మధ్యాహ్నం కోట్‌పల్లిలోని స్నేహితుల వద్దకు బైక్‌పై వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి సదాశివాపేటకు వస్తుండగా మోమిన్‌పేట మండలం మొరంగపల్లి కార్తికేయ కంపెనీ వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో జావీద్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని 108లో సదాశివాపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. గాయపడ్డ స్నేహితున్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. మృతుని అన్న హనీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

కులకచర్ల, అక్టోబర్ 4 : కులకచర్ల గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో భాస్కర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్న యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అను మతులు లేకుండా అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపడితే అలాంటివారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ వెంకటయ్య, బిల్‌కలెక్టర్ రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టం..

# యువకుడి ఆత్మహత్య

### కుమారుడి మృతితో తల్లి ఆత్మహత్యాయత్నం

హయత్‌నగర్, అక్టోబర్ 4: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టం రావడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మృతి చెందాడన్న వార్తతో తల్లి కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ హృదయ విధారక ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యానగర్ కాలనీలో తాటికొండ అఖిల్‌రెడ్డి (24) తన తల్లి లూర్దమ్మతో కలిసి ఉంటున్నాడు. అఖిల్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. తల్లి లూర్దమ్మ సంగారెడ్డి జిల్లా సదాశివపేట మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నది. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భార్య, కుమారుడికి దూరంగా ఉంటున్నాడు. అఖిల్‌రెడ్డి ఆన్‌లైన్ ట్రేడింగ్ షేర్ మార్కెట్‌లో దాదాపు రూ.25 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల్‌రెడ్డి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉన్న ఒక్క కుమారుడు అఖిల్‌రెడ్డి మృతి చెందాడని తెలిసిన తల్లి లూర్దమ్మ.. తీవ్ర మనోవేదనకు గురైంది. ఇంటిలోని బాత్‌రూమ్, టాయిలెట్ క్లీన్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను గమనించిన స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం హయత్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లూర్దమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. అఖిల్‌రెడ్డి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఒకే ఇంట్లో రెండు విషాదఛాయలు అలుముకోవడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

క్లెయిమ్ చేయని

# వాహనాల వేలం

### అభ్యంతరాలుంటే ఆరు నెలల్లో దరఖాస్తు చేసుకోండి

### హైదరాబాద్ సీపీ, సీవీ ఆనంద్

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న, గుర్తుతెలియని వ్యక్తులు రోడ్లపై వదిలేసిన 1212 వాహనాలు ఇంత వరకు ఎవరూ క్లెయిమ్ చేయలేదని, వాటిని అండర్ సెక్షన్ 7 హైదరాబాద్ (మెట్రోపాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్ 2004, రెడ్ విత్ 40 హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం వేలం వేస్తామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రకటించారు. అయితే, ఈ వాహనాలలో ఏదైనా అభ్యంతరమున్నా, యజమాన్య, హైపోథికేషన్ హక్కులకు సంబంధించిన డాక్యుమెంట్లతో ఈ ప్రకటన వెలువడిన ఆరు నెలల్లోపు బంజారాహిల్స్‌లోని నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసి, తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చని సూచించారు. ఆరు నెలల్లో ఎవరూ క్లెయిమ్ చేయక పోతే.. ఆయా వాహనాలను వేలం వేస్తామన్నారు. ఈ వాహనాల వివరాలు గోషామహల్‌లోని శివకుమార్ లాల్ పోలీస్ స్టేడియం ఆఫీస్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే, హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్(www.hyderabadpolice.gov.in) లోనూ అందుబాటులో ఉంటాయని సీపీ సూచించారు.

PUBLIC NOTICE

ప్రకటన

నా క్లయింట్ శ్రీ మాశెట్టి అశోక్, S/o. M.జ్ఞానయ్య, వయస్సు: 58 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, హౌస్ నెం. 3-43/1, గంజ్ రోడ్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ మరియు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నివాసి ఇచ్చిన సూచన మేరకు సాధారణ ప్రజలు మరియు సంబంధిత వారికి తెలియజేయబడినది ఏమనగా, శంకర్‌పల్లి పట్టణం వద్దగల సర్వే నెం. 198 మరియు అందులోని ఉప సర్వే నెంబర్లు మరియు అందులోని రెండు ఎకరాల ఐదు గుంటల (2.05) భూమి నా క్లయింట్‌కు చెందినది. ఈ మొత్తం విస్తీర్ణంలో 100 Feet శంకర్‌పల్లి - హైదరాబాద్ రోడ్‌కు అవతల, సాయిబాబా థియేటర్ పరిసరాల్లో ఉన్న ఐదు గుంటల భూమి కూడా భాగంగా ఉన్నది.

అయితే, పై సర్వే నెంబర్‌లో పేర్కొన్న భూమిలోని ఐదు (5) గుంటల భూమి కోసం ఒక విక్రయ లావాదేవీ జరుగబోతుందని విశ్వసనీయ వర్గాల ద్వారా మా క్లయింట్ దృష్టికి వచ్చినది. అందువల్ల, ఈ ప్రకటన ద్వారా చట్టపరమైన హెచ్చరిక చేయునది ఏమనగా, పై భూమి మా క్లయింట్‌కు చెందినది. కావున, ఆ భూమికి సంబంధించిన ఎటువంటి కొనుగోలు లేదా అమ్మకపు లావాదేవీలను జరపవద్దని మీ అందరినీ హెచ్చరిస్తున్నాము. అటువంటి లావాదేవీలు జరిగితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని గమనించగలరు.

**M/s. D.TEJASWI,** Advocate
Office at: 01st Floor, Adjacent to Court Building, Kukatpally Courts, Madhapur, Hyderabad, **Ph: 9398270823.**